
సాక్షి ఒడిశా

మంగళవారం । 25 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,97,140లు, బంగారం 3 గ్రాముల 780 మిల్లీగ్రాములు, వెండి 117 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



విషాహారం తిని..

విషాహారం తిని ఇద్దరు చిన్నారులు చనిపోయారు. పర్లాకిమిడి పరిధిలో ఘటన జరిగింది.

- 8లో



నేర నియంత్రణకు చర్యలు

రాష్ట్రంలో నేరాల చిట్టాను సీఎం విప్పారు. నేర నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

గుసాని సమితిలో చైన్ స్నాచింగ్



బంగారు గొలుసు పోగొట్టుకున్న జానకమ్మ

పర్లాకిమిడి: గుసాని సమితి ఏడోమైలు జంక్షన్ వద్ద చైన్‌స్నాచింగ్ జరిగింది. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు మహిళ మెడలో మూడు తులాల బంగారం చైన్‌ను తెంచుకొని పరారయ్యారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఏడో మైలు వద్ద బుసుకిడి పంచాయతీకి చెందిన మజ్జి బైరాగి మాస్టార్.. ఆయన భార్య ఎం.జానకమ్మ స్కూటీపై పర్లాకిమిడి మెడికల్‌కు వచ్చి పనులు ముగించుకుని తిరిగి వెళ్తున్నారు. ఏడోమైలు సమీపంలో ముఖానికి మాస్క్ వేసుకుని వెనుకనుంచి వచ్చిన ఇద్దరు దుండగులు మజ్జి జానకమ్మ మెడలోని బంగారు గొలుసును లాక్కుని రాయగడ వైపు పారిపోయినట్టు బాధితురాలు విలపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్కూటీ పైనుంచి దంపతులిద్దరూ రోడ్డు మీద పడిపోయారు. గురండి పోలీసు ఐఐసీ ఓం నారాయణ పాత్రో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏడో మైలు జంక్షన్ వద్ద తరచూ చైన్ స్నాచింగ్ సంఘటనలు జరుగుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి



విద్యుత్ శాఖ అధికారులతో చర్చిస్తున్న చలాన్‌పుట్ గ్రామస్తులు

కొరాపుట్: తమ గ్రామంలో తక్షణం ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. కొరాపుట్ జిల్లా సునాబెడాలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి సోమవారం సిమిలిగుడ సమితి రాజ్‌పుట్ గ్రామ పంచాయతీ చలాన్‌పుట్ గ్రామస్తులు తరలివచ్చారు. తమ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని అధికారులు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు మూడు రోజులలో ట్రాన్స్‌ఫారం పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

యువకుడు ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న యువకుడి మృతదేహం

కొరాపుట్: గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కొట్ సమితి దండసోర్ గ్రామ సమీపంలోని అడవుల్లోని చెట్టుకు యువకుడి మృతదేహం వేలాడుతూ ఉండటాన్ని అటుగా వెళ్లిన గిరిజనులు సోమవారం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడిన జమున ఖరా

మల్కన్‌గిరి: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డరు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి కేంద్రం గోజియాగూడ గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకుంది. గాయపడిన వారిని చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చిత్రకొండ సమితి బోడపోదర్ పంచాయతీ రేఖపల్లి గయరామం గ్రామానికి చెందిన జమున ఖరా, కలిమెల సమితికి చెందిన నీలాంచల్ సాహులు వాహనాలతో ఢీకొట్టుకోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఇద్దరు గాయపడడంతో ప్రాథమిక వైద్యం అనంతరం నీలాంచల్‌ను మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. చిత్రకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12 గంటల.. నరకం



కొరాపుట్ వైపు నిలిచిన వాహన శ్రేణి



అడుగు ముందుకు వెళ్లలేని స్థితిలో వాహనాలు



జాతీయ రహదారి దుస్థితి

- స్తంభించిపోయిన విశాఖపట్నం-రాయ్‌పూర్ జాతీయ రహదారి
- కొరాపుట్-సునాబెడాల మధ్య నిలిచిపోయిన వందలాది వాహనాలు

కొరాపుట్:

విశాఖపట్నం-రాయ్‌పూర్ జాతీయ రహదారి-26 పై ఆదివారం రాత్రి భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు వివిధ సమయాల్లో సుమారు 12 గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. కొరాపుట్ జిల్లా కేంద్రం నుంచి సునాబెడా మధ్య మెహన్ పొడ గ్రామ సమీపంలో అత్యధికంగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ రెండు పట్టణాల మధ్య రోడ్డు విస్తరణ పనులు గత 4 నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. అనేక చోట్ల గోతులు తీశారు. రోడ్డు మెత్తం మట్టి పనులు జరుగుతున్నాయి. కాల వైశాఖి ప్రభావంతో ఈ ప్రాంతంలో భారీ వర్షం పడింది. దాంతో మట్టి బురదగా మారింది. సుమారు 12 కిలోమీటర్ల పరిధిలో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. అనేక చోట్ల పోలీసు వాహనాలు, అంబులెన్స్‌లు కూడా ముందుకెళ్లలేక నిలిచిపోయాయి. ఈ మార్గం గుండా ఆంధ్ర ప్రదేశ్ నుంచి కొరాపుట్, నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి జిల్లాలతో పాటు చత్తీస్‌గఢ్‌కు వెళ్తారు. రాయ్‌పూర్, భువనేశ్వర్, విజయవాడ, పూరి, రాజమండ్రి, విశాఖపట్నం తదితర పట్టణాలకు ఈ మార్గం గుండా రాత్రి పూట బస్సు సర్వీసులు నడుస్తాయి. దాంతో వందలాది మంది ప్రయాణికులు బస్సులలో ఉండి పోయి అవస్థలు పడ్డారు. ఉదయం పూట పరీక్షలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు బురద లోనే నడుచుకుంటూ ముందుకు సాగారు. ప్రతి అరగంటకు వాహనాలు ముందుకు సాగుతున్నాయి. ఈ వార్తలు దావానలంగా వ్యాపించడం తో విశాఖ పట్నం నుంచి వచ్చే వాహనాలు అరుకు,నందపూర్ మీదుగా జయపూర్ వైపు మళ్లాయి. భువనేశ్వర్ వైపు వెళ్లే వాహనాలు రాయగడ లేదా భవాని పట్న వైపు మరలాయి.



తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న దృశ్యం



ప్రయాణికుల అవస్థలు



సునాబెడా మార్గంలో భారీ వాహనాలు



బురద లో కూరుకు పోయిన ప్రభుత్వ బస్సు

నీల మాధవుని సేవలో రాష్ట్రపతి



నీల మాధవుని పూజాదుల్లో పాల్గొన్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆశీర్వచనం అందిస్తున్న అర్చక వర్గం

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం నయాగఢ్ జిల్లా కొంటిలో ప్రాంతం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నీల మాధవుని దేవస్థానంలో ప్రత్యేక పూజాదుల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆమె నయాగడ్ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమె వెంట రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఉన్నారు. కొంటిలో నీల మాధవుని దేవస్థానం సందర్శించిన తొలి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కావడం విశేషం.

కొరాపుట్‌లో కుంభవృష్టి



మైదానంలో చేరిన వరద

- భారీగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో కాల వైశాఖీ విజృంభించింది. ఆదివారం కుంభవృష్టిగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తీవ్రమైన గాలులు వీయడంతో జనం భయాందోళనకు గురయ్యారు. పొలాల్లో నీరు చేరింది. పలుచోట్ల గండ్లు పడ్డాయి.



జలమయం



నీటి ప్రవాహంతో ఏర్పడిన గోతులు

దేబేంద్ర శర్మకు నివాళి



సభలో మౌనం పాటించిన సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో సభ్యులు సోమవారం కాసేపు మాజీ ఎమ్మెల్యే దేబేంద్ర శర్మ మృతిపై సంతాపం ప్రకటించి మౌనం పాటించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సభలో సంతాప తీర్మానం ప్రవేశ పెట్టారు. విపక్ష నేత నవీన్ పట్నాయక్ తరపున ప్రసన్న ఆచార్య ఈ ప్రతిపాదనకు మద్దతు ప్రకటించారు. ఈ నేపథ్యంలో స్పీకర్ సురమా పాఢి సంతాప తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం సభలో సభ్యులు ఒక నిమిషం మౌనం పాటించి దివంగత మాజీ ఎమ్మెల్యే దేవేంద్ర శర్మకు నివాళులు అర్పించారు.

పవిత్ర పుష్కరిణిలో తేలిన శవం

భువనేశ్వర్: పూరీలోని పవిత్ర శ్వేత గంగ పుష్కరిణిలో మృత దేహం తేలింది. బాలాసోర్ బొస్తా ప్రాంతానికి చెందిన గోవింద బింధాని శవంగా గుర్తించారు. ఈ శవాన్ని అగ్నిమాపక సిబ్బంది వెలికి తీశారు. శవ పరీక్ష కోసం సదరు ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

శియ్యాళీలో గ్రీవెన్స్



ప్రజావినతులు అందుకుంటున్న అధికారులు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి శియ్యాళీ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ ముఖి పరిపాలన, గ్రీవెన్సు సెల్‌కు జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్‌పండా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్పందన కార్యక్రమానికి మొత్తంగా 79 వినతులు అల్లడ, కిడిగాం, గోరిబంద, ఖండవ పంచాయతీల నుంచి అందాయి. వాటిలో ఒకటి అక్కడికక్కడే పరిష్కరించగా, గ్రామసమస్యలు 29, వ్యక్తిగతం 50 ఉన్నాయి. కార్యక్రమానికి గుసాని సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, కాశీనగర్ బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి డంబురధర మల్లిక్, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ఎంఎం ఆలీ, డీఎస్ఎస్ఓ సంతోష్‌కుమార్ నాయక్, సర్పంచు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు యథాతథం

- నెలవారీ మీటర్ అద్దె మినహాయింపు

భువనేశ్వర్:

రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు ఒడిశా విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఓఈఆర్‌సీ) తీపి కబురు తెలియజేసింది. ఈ ఆర్థిక సంవత్సరం విద్యుత్ వినియోగ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండబోదని సోమవారం ప్రకటించింది. విద్యుత్ చార్జీల్ని వరుసగా నాలుగో సంవత్సరం యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ఓఈఆర్‌సీ ప్రకటించింది. అదనంగా విద్యుత్ మీటరు నెలవారి అద్దె మినహాయింపు కల్పించింది. 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా సుంకం గత ఆర్థిక సంవత్సరం 2024–25 మాదిరిగానే ఉంటుందని కమిషన్ పేర్కొంది. 2 కిలో వాట్ల వరకు కనెక్ట్ చేయబడిన లోడ్‌తో స్మార్ట్ మీటర్లను ఉపయోగించే వారికి ఇప్పుడు నెలవారీ రూ. 60 మీటర్ అద్దె చెల్లించడం నుంచి మినహాయింపు ఇస్తున్నారు. దీని వలన దాదాపు 80 లక్షల మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రీ-పెయిడ్ మీటర్లు ఉన్న వినియోగదారులు, డిజిటల్ చెల్లింపు మాధ్యమాల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే వారికి బిల్లు మొత్తంపై 4 శాతం రాయితీ సదుపాయం యథాతథంగా కొనసాగుతుంది.

కొత్త రాయితీ

ఈ ఏడాది విద్యుత్ వినియోగదారులకు సరికొత్త రాయితీ ప్రకటించడం విశేషం. ఎస్ఎంఎస్, 2 మెయిల్ లేదా ఏదైనా ఇతర ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో విద్యుత్ బిల్లులను స్వీకరించడానికి ఎంచుకునే వినియోగదారులకు ప్రతి బిల్లుకు అదనంగా రూ.10 తగ్గింపు పొందేందుకు అర్హులు అవుతారని ఓఈఆర్‌సీ తెలిపింది.

విద్యుత్ యూనిట్ చార్జీలు

ఓఈఆర్‌సీ తాజా నిర్ణయం మేరకు గృహ వినియోగదారులు తొలి 50 యూనిట్ల వినియోగానికి ప్రతి యూనిట్‌కు రూ. 3 చెల్లిస్తారు. 50 యూనిట్ల నుంచి 200 యూనిట్ల వరకు వినియోగానికి యూనిట్‌కు రూ. 4.80, 200 నుంచి 400 యూనిట్ల వరకు రూ. 5.80 మరియు 400 యూనిట్లకు పైన రూ. 6.20 చెల్లిస్తారు.

హరిత విద్యుత్ ప్రోత్సాహం

హరిత విద్యుత్ (గ్రీన్ ఎనర్జీ) వినియోగం ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా ఉదయం 8 నుండి సాయంత్రం 4 వరకు 10 కిలో వాట్ కంటే అధికంగా విద్యుత్తును ఉపయోగించే వారికి యూనిట్‌కు 20 పైసల చొప్పున రాయితీని ప్రకటించింది. 2021–22 ఆర్థిక సంవత్సరం నుండి రిటైల్ సరఫరా సుంకం పెంచకుండా యథాతథంగా కొనసాగిస్తున్నారు. అప్పట్లో సగటున యూనిట్‌కు 30 పైసలు పెంచారు.

ఎట్టకేలకు నిఖిలేష్ మృతదేహం వెలికితీత



కెనాల్‌లో నుంచి నిఖిలేష్ శవాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: కెనాల్‌లో గల్లంతైన స్థానిక మహారాణిపేట రామ్‌దాస్‌లైన్ యువకుడు పి.నిఖిలేష్ మృతదేహాన్ని దాదాపు 60 గంటల తర్వాత వెలికి తీశారు. ఈ సంఘటనపై జయపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోస్టుమార్టం తర్వాత అతడి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పట్టణ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి వెల్లడించారు. ఉదయం కుంధారగుడ సమీప ప్రధాన కెనాల్‌లో శవం తేలుతుండటం ప్రజల చూశారు. ఆ మృతదేహం ధన్‌పూర్ శాఖ కెనాల్ వరకు కొట్టుకువెళ్లి అక్కడి గేట్‌కు చిక్కుకుంది. ఆ ప్రాంత ప్రజలు విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. పోలీసులు, నిఖిలేష్ కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. అగ్ని మాపక సిబ్బంది మృత దేహాన్ని బయటకు తీయగా కుటుంబ సభ్యులు గుర్తు పట్టారు. అనంతరం నిఖిలేష్ మృతదేహాన్ని కొరాపుట్ జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ యువకుడు సతిగుడ డేమ్ ఎల్లో బ్రిడ్జి వద్ద కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు.

క్లుప్తంగా

ఫాస్ట్‌ఫుడ్ దుకాణంలో సిలిండర్ లీక్



ఫాస్ట్‌ఫుడ్ కేంద్రంలో మంటలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి కాట్రగుడ గ్రామంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో వంట గ్యాస్ లీకైంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సిలిండర్లను బయటకు తీసి ప్రమాదాన్ని తప్పించారు. ప్రమాదంలో ఫాస్ట్‌ఫుడ్ కేంద్రం యజమాని సుశాంత్ తీవ్రంగా గాయ పడ్డారు.

కత్తి చూపి గొలుసు దొంగతనం



చైన్లను పోగొట్టుకున్న బాధిత మహిళలు

జయపురం: జయపురంలో చైన్‌స్నాచర్లు రెచ్చిపోతున్నారు. బైక్‌పై వచ్చిన ముగ్గురు స్నాచర్లు ఇద్దరు మహిళలను కత్తితో బెదిరించి మెడలో ఉన్న బంగారు గొలుసులను తెంపుకుపోయారని ఫిర్యాదులు అందయాని స్థానిక పోలీసులు సోమవారం తెలిపారు. ఎంజీ రోడ్డు నివాసులు జి.రమణమ్మ, ఆమె స్నేహితురాలు పి.హేమ సోమవారం ఉదయం వాకింగ్ కోసం పూర్ణాఘడ్‌లో దక్షిణ కాళీ మందిరం వెళ్తుండగా ముగ్గురు దుండగులు బైక్‌పై వచ్చి వారికి కత్తితో బెదిరించి వారి మెడలలో ఉన్న బంగారు గొలుసులు దోచుకు పోయారు. దుండగులు ఏనుగుల శాల వైపు వెళ్లిపోయినట్టు బాధితులు పోలీసులకు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోగ నిర్ధారణ మిషన్ కోసం ఆర్థిక సాయం



కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌కు చెక్కును అందజేస్తున్న నాల్కో ఫౌండేషన్ బృందం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో సికిల్ సెల్ అనీమియా, క్షయ రోగ నిర్ధారణ స్క్రీనింగ్ కోసం నవరత్న కంపెనీ నాల్కో ఫౌండేషన్ వారు సోమవారం కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌కు 1కోటి 24లక్షల 70వేలు చెక్కును అందజేశారు. ఈ సాయంతో అతి త్వరలోనే వ్యాధి నిర్ధారణ మిషన్‌ను తీసుకువస్తామని తెలిపారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి పూజారిగుడ పంచాయతీ బాసినీగుడలో గల సహిద్ లక్ష్మణ నాయక్ డిగ్రీ కళాశాలలో వేసవి శిబిరం ఆదివారం ప్రారంభించారు. ఈ క్యాంపులో బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ రాజేష్ మహురియ రాష్ట్ర పురస్కార గ్రహీత స్వచ్ఛంద సేవకులు సంతోష్ కుమార్‌లు పాల్గొని బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు.

పైపులు చోరీ చేసిన ఇద్దరి అరెస్టు



అరెస్టయిన నిందితులు, స్వాధీనం చేసుకున్న పైపులతో పోలీసులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి వెంకటపాలెం గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న మెగా మంచినీటి ప్రాజెక్ట్ నుంచి ఇనుప పైపులను ఆదివారం రాత్రి చోరీ చేసిన ఇద్దరిని గ్రామస్తులు పట్టుకొని కలిమెల పోలీసులకు అప్పగించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు పోలీసులు సోమవారం వెల్లడించారు. అరెస్టయిన వారిలో కూధ ఎంవీ 8 గ్రామానికి చెందిన దేవబ్రత హాల్దార్, ఎంపీవీ 17 గ్రామానికి చెందిన అమిత్ మండాళ్ ఉన్నారన్నారు. కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి వీరిపై కేసు నమోదు సోమవారం కోర్టులో హాజరు పరిచారు.

ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు నేడు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆల య హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ మంగళవా రం ఉదయం 8 గంటల నుంచి అనివెట్టి మండపంలోనిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈఓ వై.భద్రాజీ ప్రక టనలో తెలియజేశారు. ఈమేరకు నిబంధనల ప్రకా రంగ్రామపెద్దలు, ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు, ప్రధానార్చకులు సమక్షంలో హుండీ లను తెరిపించి లెక్కింపును చేపడతామని ఆయన వివరించారు.

రాష్ట్రంలో నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు: సీఎం

- మూడేళ్లలో 5.92 లక్షల పైబడి ప్రధాన నేరాలు
- భువనేశ్వర్ యూపీడీలో 250కి పైగా క్రిమినల్ కేసులు



శాసన సభ ప్రశ్నోత్తరాల్లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో పెరుగుతున్న నేరాల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శాసన సభలో సోమ వారం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలలో రాష్ట్రంలో 10 ప్రధాన నేరాల కేటగిరీల కింద మొత్తం 5,92,257 కేసులు నమోదైనట్లు ముఖ్యమంత్రి తెలిపారు. రౌర్కెలా ఎమ్మెల్యే శారద ప్రసాద్ నాయక్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ హత్య, దోపిడీ, దొంగతనం, మోసం, అల్లర్లు, అత్యాచారం, మోటారు వాహన ప్రమాదాలు వంటి 10 ప్రధాన నేర వర్గాలుగా పేర్కొన్నారు. ఈ వర్గాల కింద పెరుగుతున్న నేరాల రేటును పరిష్కరించడానికి ఒడిశా పోలీసులు అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు ముఖ్యమంత్రి సభలో వివరించారు.

అత్యవసర ప్రతిస్పందన మద్దతు వ్యవస్థ (ఈఆర్‌ఎస్‌ఎస్)

రాత్రింబవళ్లు పని చేసే టోల్ ఫ్రీ నంబర్ 112 కు డయల్ చేయడం ద్వారా విపత్కర పరిస్థితుల్లో సత్వర సేవల్ని అందజేసేందుకు అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. నేర దర్యాప్తు వ్యవస్థని సమర్థం చేశామని, కటక్‌లోని రాష్ట్ర క్రైమ్ బ్రాంచ్‌లోని దర్యాప్తు సహాయ విభాగం సమర్థవంతమైన నేర దర్యాప్తుల కోసం జూమ్ మరియు గూగుల్ మీట్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫార మ్‌లను ఉపయోగించడం విశేషంగా పేర్కొన్నారు.

లింగ ఆధారిత హింస నివారణ

లింగ ఆధారిత హింసను నివారించడానికి సంపర్క్ టోల్-ఫ్రీ నంబర్ 1800-4191-831 ప్రవేశపెట్టారు. అదనంగా రాష్ట్ర వ్యాప్తంగా 633 పోలీస్ స్టేషన్లలో మహిళలు మరియు పిల్లల డెస్కులు ప్రత్యేకంగా పనిచేస్తున్నాయి. భువనేశ్వర్ అర్బన్ పోలీస్ డిస్ట్రిక్ట్ (యూపీడీ)లో గత 9 నెలల్లో 285 క్రిమినల్ కేసులు నమోదయ్యాయని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. వీటిలో 52 హత్యలు, 97 అత్యాచారాలు, 10 వరకట్న హత్య కేసులు, 1 వరకట్న ఆత్మహత్య కేసు, 37 వరకట్న హింస కేసులు, 44 వరకట్నయేతర హింస కేసులు, 42 మైనర్ బాలికల అత్యాచార కేసులు, 2 సామూహిక అత్యాచార కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఖరియార్ ఎమ్మెల్యే అధిరాజ్ మోహన్ పాణిగ్రాహి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి మాఝి ఈ వివరాల్ని సభలో ప్రవేశ పెట్టారు.

జైలుకెళ్లినా తీరు మారలేదు



గంజాయితో పట్టుబడిన యువకులతో ఎస్‌ఐ ధనుంజయ్

- 12 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ ఇద్దరు నిందితులు

కె.కోటపాడు (అనకాపల్లి జిల్లా): జైలుకెళ్లినా వారి తీరు మారలేదు. ఒకరు గంజాయి కేసులోనూ, మరొకరు దొంగతనం కేసులోనూ శిక్ష అనుభవించి ఈ నెలలోనే జైలు నుంచి విడుదలయ్యారు. మరలా పాత పంథాలోనే నేరాల బాట పట్టడంతో కటకటాల వెనక్కి వెళ్లారు. మండలంలో బత్తివానిపాలెం కూడలి వద్ద సోమవారం 12 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకున్నారు. వీరిద్దరి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఆర్.ధనుంజయ్ వివరాల ప్రకారం... ఇక్కడ వాహనాలను తనిఖీ చేస్తుండగా, బ్యాగులతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను తనిఖీ చేశారు. వీరి వద్ద బ్యాగుల్లో 12 కిలోల గంజాయిని గుర్తించి అదుపులోనికి తీసుకున్నారు. వీరిది ఢిల్లీకి చెందిన శిబరాం ప్రధాన్, ఒడిశాకు చెందిన నందన్ రాంగా గుర్తించారు. ఈ గంజాయిని ఒడిశాలోని జోలాపుట్ నుంచి బత్తివానిపాలెం కూడలి మీదుగా పెందుర్తి రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లే క్రమంలో పట్టుబడ్డారు. బరంపురం జైల్లో శిబరాం ప్రధాన్ గంజాయి కేసులోను, నందన్‌రాం దొంగతనం కేసులో శిక్ష అనుభవించి ఈ నెలలోనే విడుదలయ్యారు. అక్కడ జైల్లో ఏర్పడిన పరిచయంతో వీరిద్దరూ మరలా గంజాయి రవాణాకు పాల్పడుతూ పట్టుబడ్డారు. వీరిద్దరిపైన కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గంజాయి విలువ రూ.60 వేలు ఉంటుందన్నారు.

కార్టూన్స్ పోటీలో ‘శేఖర్‌బాబు’కు అవార్డు



విజయవాడలో సాహితీవేత్త కాపూరి సత్యవతి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న శేఖర్ బాబు

పర్లాకిమిడి: విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పురస్కరించుకుని ఉత్తరాంధ్ర కార్టూనిస్టుల ఫోరం(విశాఖ) తరఫున నిర్వహించిన అంతర్రాష్ట్ర కార్టూన్స్ పోటీలలో పర్లాకిమిడి (ఒడిశా) కు చెందిన కార్టూనిస్టు శేఖర్‌బాబుకు ఉత్తమ కార్టూనిస్టుగా అవార్డు వచ్చింది. విజయవాడ కాకరపర్తి భావనారాయణ కళాశాలలో ఆదివారం జరిగిన బహుమతి ప్రదాన ఉత్సవంలో ప్రముఖ సాహితీవేత్త కాపూరి సత్యవతి ముఖ్యఅతిథిగా పాల్గొని వేదికపై శేఖర్‌బాబుకు మెమొంటో, రూ.1000లు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర కార్టూనిస్టుల ఫోరం అధ్యక్షులు పి.వి.రామశర్మ, యస్.లక్ష్మణ రావు (లాల్), టి.రాజేంద్రబాబు, కె.బి.ఎస్.కళాశాల ప్రిన్సిపల్ డా.క్రిష్ణవేణి, క్రియేటివ్ కల్చరల్ కమిషన్, డైరక్టర్ ఆర్.మల్లి కార్జున రావు, కార్టూన్ పోటీల నిర్వాహకులు కె.వి.వి.సత్యన్నారాయణ, హాస్యానందం ఎడిటర్ రాము పండా తదితరులు పాల్గొన్నారు.

విషాహారం తిని ఇద్దరు చిన్నారులు మృతి



రామగిరిలో అస్వస్థతకు గురైన చిన్నారి



పర్లాకిమిడి మెడికల్‌కు తీసుకువచ్చిన చిన్నారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి సమితి రామగిరి ప్రాంతంలో తులసీనగర్‌లో ఐదుగురు చిన్నారులు విషాహారం తిని అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్థానికులు రామగిరి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. రామగిరిలో చికిత్స పొందుతూ ఒక చిన్నారి తులసీ బోడమొండి (5) మృతిచెందగా, పర్లాకిమిడి ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో చిన్నారి గుణాబతి బోడమొండి (3) మృతి చెందినట్టు ఆర్.ఉదయగిరి పోలీసులు తెలియజేశారు. మిగతా ముగ్గురు ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఇచ్చే ఛతువా పిండిలో మరేదో ఆహారం కలిపి తినడంతో ఈ పరిస్థితి తలెత్తిందని ప్రభుత్వ డాక్టర్లు అనుమానిస్తున్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ల ప్రారంభం



విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ, కలెక్టర్

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో ఉమ్మర్‌కోట్ సబ్ డివిజన్ జొరిగాం సమితి దోడ్రా, రాయిఘర్ సమితి జొడింగాలో 33/11 కేవీ విద్యుత్ స్టేషన్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ, విద్యాశాఖ మంత్రి సోమవారం ప్రారంభించారు. నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి, కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో, జొరిగాం ఎమ్మెల్యే నర్సింగ్ బోత్రా పాల్గొన్నారు.

కాలుష్యంతో అవస్థలు



మొకాపుట్ డంప్ యార్డులో మంటలు

జయపురం: జయపురం పట్టణ సమీప మొకాపుట్ ప్రాంతంలో పురపాలక పరిషత్ వారు పట్టణంలో చెత్తను పారవేసేందుకు డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. డంపింగ్ యార్డులో సోమవారం మంటలు ఎగిసి పడ్డాయి. ఈ ప్రాంత వాసులు పొగతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ యార్డుకు సమీపంలోనే ఆశ్రమ పాఠశాల ఉంది. డంప్ యార్డు నుంచి వెలువడే దుర్గంధం వలన విద్యార్థులు అనారోగ్యానికి లోనవుతున్నారు. యార్డులో మంటలు రేగడం వల్ల వేడి గాలలు వీస్తున్నాయని స్థానికులు అంటున్నారు. కాలుష్య నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా కోరుకొండ సమితి కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. సమితిలోని పలు పంచాయతీలకు చెందినవారు వినతిపత్రాలను అందజేశారు. పాత చిత్తపరికి రహదారి నిర్మించాలని ఆ గ్రామస్తులు కోరారు. మొత్తం 27 వినుతులు అందినట్లు అధికారులు తెలిపారు. ఎస్పీ వినోద్ పటేల్, సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ చంద్ర సబర్, కోరుకొండ సమితిలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రానైట్ టిప్పర్ స్వాధీనం



పర్లాకిమిడి స్టేషన్ వద్ద సీజ్ చేసిన గ్రానైట్ టిప్పర్

పర్లాకిమిడి: గుసాని సమితి యం.యస్.పూర్ గ్రామం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న గ్రానైట్ లోడ్‌ను జిల్లా మైన్స్ అధికారి దిపెన్ పరిడా సోమవారం ఉదయం పట్టుకుని స్థానిక ఆదర్శ పోలీసు స్టేషన్‌కు తరలించారు. గ్రానైట్ తరలిస్తున్న టిప్పర్‌కు ఎటువంటి మైన్స్‌కు సంబంధించి లీజు కాగితాలు లభించకపోవడంతో గ్రానైట్ కంపెనీ యాజమానికి ఒక లక్షా ఆరువేల రూపాయల జరిమానాను జిల్లా మైన్స్ అధికారి దీపెన్ పరిడా విధించారు.

నిధుల గోల్‌మాల్‌పై ఫిర్యాదు

హిరమండలం: మండలంలోని తంప పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన మామిడి చిన్నబాబు అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. విచారణ చేపట్టాలని డీపీవోకు ఆదేశించారు. పంచాయతీకి చెందిన 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులను సర్పంచ్ పక్కదారి పట్టించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీస్ శాఖలో పనిచేసిన విశ్రాంత ఉద్యోగి అయినటువంటి తన పేరును ఉప సర్పంచ్‌గా రికార్డుల్లో చూపి దుర్వినియోగం చేసినట్లు వాపోయాడు.

ఘనంగా సరస్వతీ బాల మందిర వార్షికోత్సవం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అతిథులు

జయపురం: విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయులకు గురుతర బాధ్యత ఉందని జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి చందన్ కుమార్ నాయక్ అన్నారు. జయపురంలోని సరస్వతీ బాల మందిర వార్షికోత్సవాన్ని సోమవారం స్థానిక సంఘం కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చందన్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మకమైన విద్య నేర్పాలన్నారు. సరస్వతీ బాల విద్యామందిర్ పరిచాలన కమిటీ ఉపాధ్యక్షుడు నవీనచంద్ర మహంతి అధ్యక్షత వహించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయులు ఓం ప్రకాశ్ మిశ్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథిగా ప్రాథమిక ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు దేవీ ప్రసాద్ దాస్, ఆకాశవాణి జయపురం విభాగ విశ్రాంత అధికారి ఉదయ శంకర జానీ, జయపురం సాహిత్య పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయక్, సహాయక కార్యదర్శి చంద్ర శేఖర మహాపాత్ర, కార్యదర్శి నిరంజన్ పాణిగ్రాహి ప్రసంగించారు. క్రీడా, విచిత్ర వేష ధారణ, తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ విభాగాలలో ప్రతిభావంతులను సన్మానించారు. యోగా, నృత్య, సంగీత ప్రదర్శనలు అలరించాయి. కొంత మంది విద్యార్థులు కవితలు చదివి వినిపించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన కారు

కంచిలి: మండలంలోని జాడుపూడి కాలనీ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్తున్న కారు, రోడ్డు క్రాస్ చేస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బురదపాడు గ్రామానికి చెందిన కప్పల జగదీష్ రెడ్డి అనే యువకుడు ఆదివారం కొల్లూరు గ్రామానికి వెళ్లాడు. అనంతరం అతను జాడుపూడి వద్ద భోళా శంకర్ దాబాకు ఆదివారం రాత్రి డిన్నర్‌కు వచ్చాడు. డిన్నర్ పూర్తి చేసుకొని తన బైక్ మీద జాడుపూడి కాలనీ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా, ఇచ్ఛాపురం నుంచి కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న కప్పల జగదీష్ రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని 108 అంబులెన్స్‌లో ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం వేకువజామున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు.

వంతెనను ఢీకొట్టిన లారీ



వంతెన మలుపు గొడను ఢీకొన్న లారీ



వంతెన మధ్యలో మరమ్మతులకు గురై నిలిచిన మరో లారీ

రాయగడ: రాయగడ నుంచి ఆంధ్రకు వెళ్లే ప్రధాన రహదారి మజ్జిగౌరి మందిర సమీపంలో ఉన్న వంతెనను లారీ ఢీకొనడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం ఛత్తీస్‌ఘడ్ నుంచి ఆంధ్ర వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ వంతెన మలుపులో అదుపుతప్పి ఢీకొంది. శనివారం ఆంధ్ర నుంచి రాయగడ మీదుగా వచ్చిన లారీ వంతెన మధ్యలో మరమ్మతులకు గురై నిలిచిపోవయింది. చిన్న మార్గం కావడంతో రకాపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇంతవరకు ఆ లారీని వేరే ప్రాంతానికి తరలించకపోవడంతోపాటు వంతెన మలుపు వద్ద లారీ ఢీకొని ఉండి పోవడంతో ట్రాఫిక్ పూర్తిగా స్థంభించిపోయింది. పోలీసులు చొరవ తీసుకుని రాయగడ మీదుగా ఆంధ్ర వైపు వెళ్లే భారీ వాహనాలను వ్యూ పాయింట్ మీదుగా వెళ్లేలా మరలించడంతో కొంతమేర సమస్య కొలిక్కి వచ్చింది. తరచూ ఈ వంతెన వద్ద ఇటువంటి సమస్యలు తలెత్తుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


గంజాయితో యువకుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి తరలిస్తూ ఒక యువకుడు సోమవారం పట్టుబడినట్లు సీఐ సూర్యనారాయణ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి బ్లాక్, సబరాపల్లికి చెందిన ఆమద్ ఆనంద్ సోమవారం ఉదయం 10 గంటలకు గంజాయితో పట్టుబడ్డాడు. స్వగ్రామం నుంచి పలాస రైల్వేస్టేషన్ వరకు తరలించేందుకు రూ.3 వేలకు ఒప్పందం కుదుర్చుకుని, పలాస రైల్వేస్టేషన్ రన్నింగ్ రూం పక్కరోడ్డులో నడుచుకుంటూ స్టేషన్‌లోకి వచ్చే సమయంలో పోలీసులను చూసి రెండు బ్యాగులు వదిలి ఇద్దరు వ్యక్తులు పరుగులు పెట్టారు. దీంతో పోలీసులు వెంబడించగా నిఖిల్ పాని తప్పించుకోగా, ఆమద్ అనంద్ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి వద్దనుంచి 21.7 కేజీల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అమ్మకందారులు, మధ్యవర్తులు మరో ఇద్దరు ఉన్నట్లు తెలిపారు.

నిఘా నడుమ టెన్త్ పరీక్షలు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు అధికారుల నిఘా నడుమ కొనసాగుతున్నాయి. ఇటీవల కుప్పిలి మోడల్ స్కూల్ కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా 149 పరీక్ష కేంద్రాల్లో జరిగిన మ్యాథ్స్ పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు కలిపి 28,584మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 28,384 మంది పరీక్షకు హాజరయ్యారు. వివిధ కారణాలతో 199 మంది గైర్హాజరయ్యారు. సోమవారం మ్యాథ్స్ పరీక్షలో ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని డీఈఓ స్పష్టం చేశారు. జిల్లా పరిశీలకులు మస్తానయ్య కుప్పిలి మోడల్ స్కూల్ ఏ, బీ కేంద్రాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏర్పాట్లు, సౌకర్యాలతో పాటు పరీక్షలు జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. డీఈవో డాక్టర్ తిరుమలచైతన్య జలుమూరు, సారవకోట మండల పరిధిలోని పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కుప్పిలిలో ప్రశాంతం

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో సోమవారం 10వ తరగతి గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గణితం పరీక్షను రాష్ట్ర పరిశీలకులు, మస్తానయ్య, మండల విద్యాశాఖ అధికారి కె.పున్నయ్య పరీక్ష పరిశీలించారు. ఏ, బీ పరీక్ష కేంద్రాల్లో 9 గదుల్లో 425 మంది పరీక్ష రాస్తున్నారు. పరీక్ష నిర్వహణ విధుల్లో ఉన్న ఇన్విజిలేటర్లు, కస్టోడియన్ కం సిట్టింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు 21 మందిని మార్పు చేశారు.

సిట్టింగ్ స్క్వాడ్‌గా వ్యవహరించిన డీఈఓ

సారవకోట: మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన 10వ తరగతి లెక్కలు పరీక్షకు సిట్టింగ్ స్క్వాడ్‌గా డీఈఓ తిరుమల చైతన్య వ్యవహరించారు. ఇక్కడ పరీక్షలు జరుగుతున్న విధానంపై అనుమానం రావడంతో పాటు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన పరీక్ష కేంద్రాన్ని తొలుత పరిశీలించి అనంతరం పరీక్ష ముగిసే వరకు అక్కడే ఉన్నారు. 10వ తరగతి పరీక్షలలో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చాలా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

దుప్పలపాడులో చోరీ



ఇంట్లోని బీరువా తెరిచి ఉన్న దృశ్యం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం దుప్పలపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం అల్లు మహేశ్వరరావు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అల్లు మహేశ్వరరావు, అతని భార్య లక్ష్మి ఇరువురు తమ ఇంటికి తాళం వేసి ఉదయం కూలి పనులకు వెళ్లిపోయారు. వారు సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో కంగారుపడ్డారు. వెంటనే లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో దొంగలు పడ్డారని గుర్తించారు. కష్టపడి సంపాదించి కూడబెట్టుకున్న నగదుతో పాటు సుమారు 10 తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు కోటబొమ్మాళి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వి.సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు.

క్లుప్తంగా

26న ఇ-అడ్వాన్స్ టెండర్లు

సీతంపేట: ఇ-అడ్వాన్స్ టెండర్లను ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వేల కొండచీపుర్లు, 100 క్వింటాళ్ల కుంకుడు, 100 క్వింటాళ్ల పసుపు కొమ్ముల విక్రయానికి టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. వివరాలకు జీసీసీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

గవరమ్మపేటలో ఏనుగుల గుంపు



గవరమ్మపేట ప్రధాన రోడ్డుపై ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, వెంకటరాజపురం పంట పొలాల్లో సోమవారం ఏనుగులు దర్శనమిచ్చాయి. వెంకటరాజపురంలోని బంటు అప్పలనాయుడు, దత్తి వెంకటనాయుడు, బంటు గౌరునాయుడుకు చెందిన జొన్న, అరటి తోటలు ధ్వంసం చేశాయి. ప్రభుత్వం స్పందించి తక్షణమే నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

నేడు రేపు జిల్లాలో ఏపీపీఎస్సీ పరీక్షలు

విజయనగరం అర్బన్: జిల్లాలో మంగళ, బుధవారాల్లో జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. 25న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, 25, 26వ తేదీల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో అనలిస్ట్ గ్రేడ్-2 ఉద్యోగాలకు, 26న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్ ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. జిల్లాలో ఎంవీజీఆర్ ఎంవీజీఆర్ కళాశాల, అయాన్ డిజిటల్, లెండి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు, పరీక్షల సూపరింటెండెంట్ భాస్కరరావు, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ ఎం.బాలరాజు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ కె.అనిల్‌కుమార్, పోలీస్, రెవెన్యూ, వైద్యారోగ్య శాఖ ప్రతినిధులు, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

పదవ తరగతి మ్యాథ్స్ పరీక్షకు 56 మంది గైర్హాజరు

పార్వతీపురంటౌన్: పదవ తరగతి మ్యాథ్స్ పరీక్షకు 56 మంది గైర్హాజరయ్యారని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మ్యాథ్స్ పరీక్షను జిల్లావ్యాప్తంగా 10,405 మంది రాయాల్సి ఉండగా 10,349 మంది విద్యార్థులు హాజరయ్యారని, 56 మంది గైర్హాజరయ్యారన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుంగా పరీక్ష సజావుగా నిర్వహించామని, 31 పరీక్షా కేంద్రాల్లో వర్యవేక్షక బృందాలు, 6 కేంద్రాల్లో తాను సందర్శించినట్లు తెలిపారు.

బాలల న్యాయమండలి సభ్యుల నియమానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయమండలిలో సభ్యుల నియామకానికి అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అదనపు జిల్లా పర్యవేక్షణాధికారి బీవీ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉండి ఆసక్తిగల అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడీసీడబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తును పొంది ఏప్రిల్ 9లోగా డైరెక్టర్, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ, విజయవాడకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 910 0045398నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విగ్రహాల ధ్వంసంపై కేసు నమోదు

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేటలోని నిర్మాణం జరుగుతున్న సీతారామ ఆలయంలో దుర్గాదేవి, గరుత్మంతుడి విగ్రహాల కాళ్లు, చేతులు ధ్వంసం చేసిన సంఘటనలో ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ మేరకు ఈ ధ్వంసానికి సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహిస్తున్నామని, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని పట్టుకునే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంటౌన్: పట్టణంలో గడ్డి మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పార్వతీనగర్ కాలనీకి చెందిన తరుణ్ ప్రేమ వివాదంలో అమ్మాయి మాట్లాడడం లేదని మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న గడ్డిమమందు సోమవారం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు పార్వతీపురంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు రిజిస్ట్రేషన్లు.. ఆరు స్టాంపులు..!

- యథేచ్ఛగా స్టాంపు వెండర్ల దోపిడీ
- ఇ-స్టాంప్‌లపై అక్రమంగా వసూలు
- సబ్‌రిజిస్టార్ కార్యాలయంలో మాన్యువల్ స్టాంప్‌లకు బ్రేక్
- సిండికేట్‌గా మారిన విక్రయదారులు



రాజాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రాజాం: ఆస్తుల లావాదేవీలు, ప్రాపర్టీ సేల్ డీడ్‌లు, లీజు ఒప్పందాలు, పార్టనర్‌షిప్ డీల్‌లు, పవర్ ఆఫ్ అటార్నీ డాక్యుమెంట్లు, అఫిడవిట్‌లతో పాటు అనేక రకాలైన చట్టపరమైన ఒప్పందాలకు ప్రధాన ఆధారమైన నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పత్రాల విక్రయాల్లో దోపిడీ పెరిగింది. రాజాం పట్టణంలో కొంతకాలంగా ఇ-స్టాంప్ పత్రాల విక్రయాలు పెరిగాయి. మూడునెలలుగా రాజాం సబ్ రిజిస్టార్ కార్యాలయంలో మాన్యువల్ నాన్ జ్యుడిషియల్ పత్రాల విక్రయం నిలిపివేశారు. దీంతో ఇ-స్టాంప్ పత్రాలనే దండిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా విక్రయదారులు వాటి ధరలు అమాంతం పెంచేశారు. హద్దూ అదుపులేకుండా దోపిడీకి తెరతీశారు. వారికి సబ్‌రిజిస్టార్ కార్యాలయం అండగా ఉండడంతో ఈ దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది.

అక్రమ వసూళ్లు అధికం

గతంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రూ.10లు, రూ.20, రూ. 50, రూ.100 నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పత్రాలు అధికంగా లభించేవి. వాటికి రూ.10 కమీషన్ వసూలు చేయడం, లేదంటే వాస్తవ ధరకు విక్రయించే వారు. ఇ-స్టాంప్ పత్రాల వినియోగం వచ్చిన తరువాత రాజాంతో పాటు చుట్టు పక్కల పలుగ్రామాలకు చెందిన రైటర్లు తమ కుటుంబీకుల ద్వారా స్టాంప్ వెండర్ లైసెన్సులు పొందారు. వారంతా సిండికేట్‌గా మారి ఇ-స్టాంప్ పత్రాల విక్రయాల్లో అధిక ధరలకు ప్రారంభించారు. రూ.10 నుంచి రూ.50 స్టాంప్ పత్రాలకు అసలు ధరకు రూ.30 కలిపి వసూలు చేస్తున్నారు. రూ.10 స్టాంప్ పత్రాలు కావాలంటే రూ.40 చెల్లించాల్సిన పరిస్థితి కొనుగోలు దారులకు వస్తోంది. వాటిపై ఎక్కువగా ఫిర్యాదులు, ప్రశ్నలు అధికమవడంతో రూ.10, రూ.20లు స్టాంప్ పత్రాల విక్రయాలు పూర్తిగా నిలుపుదలచేశారు. రూ.50 ఇ-స్టాంప్ పత్రాలకు రూ.30లు అక్రమంగా కలిపి రూ.80, రూ.100 స్టాంప్ పత్రాలకు రూ.50 కలిపి రూ.150కు విక్రయిస్తున్నారు. వాస్తవంగా ప్రతి ఇ-స్టాంప్ పత్రం విక్రయానికి రిజిస్ట్రేషన్ల సంస్థ నుంచి రూ.10కు రూ.1.50లు చొప్పున కమీషన్ వస్తుంది. ఈ కమీషన్ చాలదనే ఆలోచనతో బయట కమీషన్లు అధికమయ్యాయి. ఇవేకాకుండా ప్రింటర్‌కు పెట్టుబడి రూపంలో స్టాంప్‌లపై అధిక ధరలు వసూలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.



ఇ-స్టాంప్‌లు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిలుపుదల

రాజాం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సేవలపై ఇటీవల సోషల్ మీడియాతో పాటు పలు సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు అధికమవుతున్నాయి. వాటికి రుజువుగా ఇప్పుడు ఇ-స్టాంప్ పత్రాల విక్రయాల్లో అక్రమవసూళ్లు ఈ కార్యాలయానికి ముడిపడి జరుగుతున్నాయనే వాదన వినిపిస్తోంది. ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కొరత లేకుండా నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పత్రాలు ఉంటాయి. రాజాం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం గత కొంత కాలంగా వాటి విక్రయాలు నిలిపివేశారు. భూముల రిజిస్ట్రేషన్లతో పాటు పెళ్లిళ్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఒప్పందాలు అన్నింటికి ఇ-స్టాంప్ పత్రాలనే కార్యాలయం కోరుతోంది. ఇటీవల అఫిడవిట్ నోటరీ విధానం ఎక్కువ కావడంతో వాటికి ఇ-స్టాంప్ పత్రాల అవసరం అధికమైంది. ఫలితంగా ఇ-స్టాంప్ విక్రయాల్లో అధికంగా వసూళ్లు పెరిగాయి. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మాన్యువల్ పత్రాలు ఉంటే ఈ ఇబ్బంది తప్పేదని పలువురు వాపోతున్నారు.

రూ.30లు అధికం

రాజాంలో ఈ స్టాంప్ పత్రాల విక్రయంలో అధికంగా వసూలు జరుగుతోంది. ఇటీవల రూ.50లు స్టాంప్ పత్రం నిమిత్తం వెళ్తే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద లేదు. ఆ ఇ-స్టాంప్ బయట వెండర్ వద్ద తీసుకుంటే రూ.30లు అదనంగా వసూలు చేశారు.

– ఏవీ అర్జున్, దోలపేట, రాజాం

చాలా ఇబ్బందిగా ఉంది.

ఈ స్టాంప్ పత్రాలు అధికంగా నోటరీలకు అవసరమతుతాయి. నోటరీ అఫిడవిట్ నిమిత్తం ఇచ్చే డబ్బుల కంటే ఈ స్టాంప్‌లకు అధికంగా ఇవ్వాల్సి వస్తోంది. రూ.30 వరకూ ప్రతి చిన్న స్టాంప్ పత్రంపై కూడా వసూలు చేస్తున్నారు.

– ఎస్.వెంకటరావు, రేగిడి మండలం

బెట్టింగ్స్‌పై ఉక్కుపాదం

- ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి



పార్వతీపురం రూరల్: క్రికెట్ బెట్టింగ్స్‌కు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, బెట్టింగ్‌లకు పాల్పడిన, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి హెచ్చరించారు. తన కార్యాలయంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠాల వలలో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు హితవుపలికారు. బెట్టింగ్స్ పెను భూతం వంటివని, ఆశచూపి అథః పాతాళానికి నెట్టివేస్తాయన్నారు. డబ్బులు పోగొట్టుకున్న అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటను ఉదహరించారు. క్రికెట్ వినోదం కోసమే చూడాలే తప్ప బెట్టింగ్‌ల వైపు మొగ్గు చూపకూడదన్నారు. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడితే వారికి నచ్చజెప్పి ఆ ఊబిలోనుంచి బయటకు తీసుకురావాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు.

అనుమానితులపై నిఘా

పార్వతీపురం జిల్లా వ్యాప్తంగా గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన వారు, అనుమానితులపై పోలీస్ నిఘా ఉంచామన్నారు. జిల్లాలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిస్తే 112/100కు డయల్ చేయాలని లేదా సమీపంలో ఉన్న పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

మెటలర్జికల్ కోర్సుతో ఉద్యోగ అవకాశాలు



ముఖ్యవక్తను సత్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ తదితరులు

- జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జి వీసీ రాజేశ్వరరావు

విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్ విద్యలో మెటలర్జికల్ కోర్సులో ప్రతిభచూపిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఇన్‌చార్జి వీసీ డి.రాజ్యలక్ష్మి అన్నారు. జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల మెటలర్జికల్ ఇంజినీరింగ్ విభాగం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ వైజాగ్ చాప్టర్ సంయుక్త నిర్వహణలో సోమవారం నిర్వహించిన 10వ నేషనల్ స్థాయి టెక్నికల్ సింపోజియం 'ఈఐఎస్ఈఎన్ 2కె25'ను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోపాటు పరిశోధనా దృక్పథాన్ని విద్యార్థిదశ నుంచే అలవర్చుకోవాలని సూచించారు. సదస్సుకు ముఖ్యవక్తగా హాజరైన హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ కె.భానుశంకరరావు మాట్లాడుతూ మెటలర్జికల్ విద్యలోని ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ల ప్రాధాన్యత కీలకమని, దానిపై ఆసక్తిని పెంచుకొని ప్రతిభావంతులు కావాలని సూచించారు. అనంతరం ముఖ్యవక్తను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, మెటలర్జికల్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు మాట్లాడారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ఆర్ఐఎంఎల్ అండ్ ఐఐఎం వైజాగ్ చాప్టర్ తాతారావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● ఆరోగ్య మిత్రల ఆందోళన



ఆరోగ్య శ్రీ (ఎన్‌టీఆర్ వైద్యసేవ) సిబ్బందికి అంతర్గత పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్, డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ఆరోగ్య మిత్రలు సోమవారం ఆందోళన చేశారు. డిమాండ్లను వినిపించారు. ఈ సందర్భంగా ఏపీ ఆరోగ్యమిత్ర అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జె.ప్రదీప్ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బంది 17 సంవత్సరాల సర్వీస్‌ను పరిగణలోకి తీసుకుని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఆరోగ్య మిత్రలకు డీపీఓ కేడర్ అమలు చేయాలన్నారు. ఆరోగ్యశ్రీలో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగి కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో వేయిటేజీ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాజారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం ఫోర్ట్

చికిత్స పొందుతూ కారు డ్రైవర్ మృతి

భోగాపురం: తగరపువలసలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తీగల నానికుమార్(22) అనే కారు డ్రైవర్ సోమవారం ఉదయం మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పాలకొండ ప్రాంతానికి చెందిన నానికుమార్ కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. కారు బేరం ఉందని తల్లికి చెప్పి సోమవారం ఉదయం వేకువజామున విశాఖపట్నం బయలుదేరాడు. ఈ క్రమంలో భోగాపురం జాతీయ రహదారి (ఎస్‌బీఐ సమీపం) వద్దకు చేరుకునేసరికి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని తగరపువలస ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి అన్నయ్య తీగల నవీన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

ఎస్‌జీటీ పరీక్షకు ఉచిత శిక్షణ

పార్వతీపురం: ఎస్‌జీటీ పరీక్షకు అర్హులైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వెనుకబడిన తరగతులు, బలహీన వర్గాల అభ్యర్థులకు డీఎస్సీలో ఎస్‌జీటీ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణకు దరఖాస్తు చేసే అభ్యర్థులు డిగ్రీ, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, టెట్ మార్క్స్ జిరాక్స్, రెండు ఫొటోలతో దరఖాస్తు చేయాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయానికి సమర్పించాలని కోరారు.

గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు వచ్చేనెల 6న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షను వాయిదా వేసినట్లు గురుకులాల సమన్వయకర్త శంబాన రూపవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఏప్రిల్ 13వ తేదీన నిర్వహిస్తామని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గమనించాలని కోరారు. హాల్ టికెట్‌లను 'ఏపీబీఆర్ఏజీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్' వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆ రోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదో తరగతికి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తీసుకొని రావాలని కోరారు. డాక్టర్ బీఆర్అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలు విజయనగరం జిల్లాలో 8, పార్వతీపురం మన్యం జిల్లాలో 5 ఉన్నాయని పేర్కొన్నారు.

క్షయ రహిత భారత్‌కు సహకరించండి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎం హెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: క్షయ రహిత భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2025 నాటికి క్షయ వ్యాధిని అంతం చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. క్షయ రోగులు అందరూ పూర్తి కాలం మందులు వాడితే వ్యాధి నయం అవుతుందని తెలిపారు. క్షయ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న కఫం పరీక్ష కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వైద్యసిబ్బందికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఎన్‌సీడీపీఓ డాక్టర్ సుబ్రమణ్యం, డీఎంఓ మణి తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా సులభంగా కేసుల పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణచక్రవర్తి



రెండు జిల్లాల మీడియేషన్ ట్రైయినింగ్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి

విజయనగరం లీగల్: మధ్యవర్తిత్వంలోని మెలకువలను నేర్చుకోవడం ద్వారా కేసులను చాలా సులభంగా పరిష్కరించవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణచక్రవర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం 40 గంటల మీడియేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో నిర్వహించిన శిక్షణలో న్యాయవాదులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మధ్యవర్తిత్వంలో భాగంగా శిక్షణ ఇవ్వడానికి తమిళనాడు రాష్ట్రానికి చెందిన రత్నతార, కేరళ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ సిరాజ్ ఎంపికైన న్యాయవాదులకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంలో వ్యాజ్యాలను మానవతా దృక్పథంతో పరిశీలించి ఉభయ పార్టీల ద్వారానే పరిష్కారం రాబట్టాలని న్యాయవాదులకు సూచించారు. ఈ మధ్యవర్తిత్వం వల్ల ఉభయ పార్టీలకు సమయం డబ్బు వృథా కాకుండా ఉంటాయని, అదేవిధంగా కోర్టులో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం చూపవచ్చన్నారు. వ్యాజ్యాల పరిష్కారానికి రాజీ కూడా ఒక మార్గమేనని ఆయన స్పష్టం చేశారు. శిక్షణ పొందుతున్న ఉమ్మడి జిల్లాల న్యాయవాదులను శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. శిక్షణను అందిస్తున్న మాస్టర్ ట్రైనీస్‌తో మాట్లాడి శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసి మోసం చేసిన కేసులో నెల్లిమర్ల మండలం తమ్మాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్ మాట్లాడుతూ తమ్మాపురం గ్రామానికి చెందిన గవిడి శ్రీనివాసరావు విశాఖకు చెందిన పైడి అమ్మినాయుడికి తప్పుడు పత్రాలతో 2022లో రూ.8.36 లక్షలకు కొంత భూమిని విక్రయించాడని తెలిపారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఆర్థిక నష్టం కలిగించినట్లు బాధితుడు అమ్మినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. దర్యాప్తులో తగిన సాక్ష్యాలు లభించడంతో ఆరోపణలు నిజమని తేలిందని తమ్మాపురంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.



ఎం.రాజపురంలో ఈదురు గాలులకు నేలమట్టమైన అరటి పంట

పంటలు వర్షార్పణం



రేగిడి: అంబకండిలో పూత దశలో నేలకొరిగిన నువ్వు పంట



వీరఘట్టం సమీపంలో పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు



శ్యాంపురం సమీపంలో ప్రధాన రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్నపిక్కలు

పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం 5 గంటల వరకు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల జలమయమయ్యాయి. అరటి, జీడిమామిడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. నువ్వుపంట నేలమట్టమైంది. నూర్పిడిచేసి కళ్లాల్లో ఉంచిన ధాన్యం బస్తాలు తడిసిముద్దయ్యాయి. వీరఘట్టం మండలంలోని వీరఘట్టం, దశుమంతపురం, చలివేంద్రి, చిట్టపులివలస, కంబర, నడిమికెల్ల, విక్రమపురం, నడుకూరు గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో అరటి తోటలు, 250 ఎకరాల్లో జీడిమామిడి తోటలు ధ్వంసమయ్యాయని, సుమారు రూ.50 లక్షల పంట నష్టం జరిగినట్టు రైతులు చెబుతున్నారు. పంటల నష్టం అంచనా వేస్తామని తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. వేసవి దుక్కులకు వర్షం ఉపకరిస్తుందని పలువురు రైతులు పేర్కొన్నారు.

– వీరఘట్టం/గుమ్మలక్ష్మీపురం



గుమ్మలక్ష్మీపురంలో పొలంలో చేరిన వర్షపు నీరు



వీరఘట్టం హైస్కూల్ గ్రౌండ్‌లో చేరిన వర్షపు నీరు